ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 129 | శనివారం 7 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## కూటమి అబద్ధాలకు చెక్

### ఫ్రస్టేషన్‌లో

## వైపీపీ పై దాడులు



**తిరుమల నెయ్యిలో ఏ కొవ్వూ లేదని తేల్చిన సిట్..**

**దేవుణ్ని రాజకీయాల కోసం వాడుకున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు...**

**జోగి రమేష్ ఇంటి సందర్శన.. టీడీపి నేతల ఫోటోలు, వీడియోలు బహిర్గతం..**

**మరో మూడేళ్లలో మాప్రభుత్వమే..**

**తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు, మాజీ సిఎం జగన్..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో ఎలాంటి జంతు కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలపలేదని సుప్రీంకోర్టు సూపర్ విజన్‌లో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ స్పష్టంగా నిర్ధారించిన తర్వాత ఫ్రస్టేషన్‌కు లోనైన టీడీపీ, వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నదని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవాళ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిని జగన్ సందర్శించి జరిగిన విధ్వంసాన్ని స్వయంగా పరిశీలించారు. జోగి రమేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన జగన్ దాడికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కష్టకాలంలో పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని జోగి రమేష్ కుటుంబానికి హామీ ఇచ్చారు. (మిగతా 2లో)



# రైతన్నలకే భూమిపై హక్కు

- ట్యాంపరింగ్ చేయకుండా రికార్డులన్నీ భద్రం..
- క్యూ ఆర్ కోడ్‌తో వివరాలు చూసుకునే వీలు..
- లంచాల వ్యవస్థకు చరమగీతం పాడేలా భూ హక్కు పత్రాలు ...
- ఎవరు ట్యాంపర్ చేసినా జైలుకు పంపిస్తాం..
- కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు..

**కర్నూలు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం అని చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు. జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా 2లో

### జగన్ హయాంలో

## కల్తీ రిక్రూట్‌మెంట్

### కల్తీ నెయ్యిపై నాలుగు నివేదికలు హోం మంత్రి అనిత



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

రాష్ట్రంలో కల్తీ రిక్రూట్‌మెంట్ బోర్డును జగన్ స్థాపించారని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. కల్తీ పాలనతో మహాపాపం చేసి ఎదురుదాడి చేయడానికి సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒకటి కాదు రెండు కాదు నాలుగు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందులో సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక 2022లో వైకాపా హయాంలో వచ్చిందే అన్నారు. (మిగతా 2లో)

### ప్రజా తిరస్కరణ

## మరిచారా పీకె



**బీహార్ అసెంబ్లీ ఎన్నికల పిటీషన్ విచారణకు సుప్రీం కోర్టు నిరాకరణ..**

**న్యాయస్థానాన్ని ప్రాచుర్యానికి వాడుకోవద్దు..**

**ప్రశాంత్‌కిషోర్‌కి సుప్రీం చురకలు..**

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

మాజీ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్‌కు దేశ అత్యున్నత న్యాయస్థానంలో తీవ్ర నిరాశ ఎదురైంది. గత ఏడాది బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను సవాల్ చేస్తూ ఆయన సారథ్యంలో జన్ సురాజ్ పార్టీ దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు విచారించేందుకు స్పష్టంగా నిరాకరించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ప్రశాంత్ కిశోర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ చివాట్లు పెట్టారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు పిటీషన్ ప్రస్తావనకు రాగానే, "మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలు మిమ్మల్ని తిరస్కరించిన తర్వాత, న్యాయ వేదికలను ప్రాచుర్యం కోసం ఉపయోగించుకోవడం సరికాదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని గుర్తుంచుకోవాలని ప్రశాంత్ కిశోర్‌కు హితవు పలికారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అనంతరం అప్పటి బీహార్ ప్రభుత్వం మహిళా రోజ్‌గార్ యోజన కింద మహిళా లబ్ధిదారులకు రూ. 10,000 బదిలీ చేసిందని, ఇది ఎన్నికల ప్రవర్తనా (మిగతా 2లో)

### ఎమ్మెల్యే అరెస్టుపై

## మధ్యంతర రక్షణ



**అక్రమ సంబంధం కేసులో ఎమ్మెల్యేకు ఊరట.**

**రాజకీయ కక్షతోనే కేసు పెట్టారని ఎమ్మెల్యే తరపు న్యాయవాది..**

**ఆరోపణలపై విచారణ కొనసాగించాలని సూచన..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే, జనసేన పార్టీ నేత అరవ శ్రీధర్‌పై నమోదైన అక్రమ సంబంధం, లైంగిక వేధింపుల కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తనపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పోలీసులు తొందరపడి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. గత నెల రైల్వే కోడూరు నియోజకవర్గంలో పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న హర్ష వీణ అనే ఉద్యోగిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై లైంగిక వేధింపులు, అక్రమ సంబంధం ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు పలు వీడియోలను కూడా విడుదల చేసింది. ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు (మిగతా 2లో)

### ప్రధాని మోడీని

## కొరికే ప్రయత్నం



**మహిళా ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు..**

**ఆయుధాలు లేవు, పళ్లతోనే కొరికే ప్రయత్నం..**

**వివాదస్పద వ్యాఖ్యలు చేసిన దీపక్‌రెడ్డి..**

**లైవ్ డిబేట్‌లో పదేపదే రిపీట్ చేసిన దీపక్‌రెడ్డి..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న టీడీపీ నేత, మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి అల్లుడు దీపక్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేసి తీవ్ర దుమారం రేపారు. తాజాగా పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడేందుకు సిద్ధమైన సమయంలో లోక్‌సభలో చోటు చేసుకున్న గందరగోళంపై ఓ ప్రముఖ ఇంగ్లీష్ టీవీ ఛానల్ నిర్వహించిన డిబేట్‌లో పాల్గొన్న దీపక్ రెడ్డి, విపక్ష మహిళా ఎంపీలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని లోక్‌సభలో విపక్ష మహిళా ఎంపీలు చుట్టుముట్టి దాడి చేసేందుకు ప్రయత్నించారని, ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు లేవని, అయితే వారు తమ పళ్లనే ఆయుధాలుగా చేసుకుని ఆయన్ను కొరికేందుకు (మిగతా 2లో)

### రాష్ట్రంలో కూటమి పాలనలో

## గూండాల రాజ్యం



**పోలీసుల సమక్షంలోనే దాడులు, పాలకుల వైఫల్యానికి నిదర్శనం..**

**మాజీ మంత్రి ఇంటిపైనే దాడి.. ఇక ప్రజలకు భద్రత ఎక్కడ..?**

**తిరుమల లడ్డూ విషయంలో బాబూ పవన్ నీఛ వ్యాఖ్యలు..**

**అమలులో రెడ్‌బుక్ రాజ్యాంగం, రాష్ట్రపతి పాలన అవసరం..**

**మాజీ మంత్రి ఆర్కె రోజా..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

ఏపీలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, పోలీసుల కళ్లముందే దాడులు జరగడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రంగా విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో టీడీపీ గూండాలు మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై జరిపిన దాడిలో జరిగిన విధ్వంసాన్ని రోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం వారు మీడియాతో (మిగతా 2లో)

### మద్రాస్ హైకోర్టులో

## విజయ్‌కు

## చుక్కెదురు



**చెన్నై (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్‌ను కొట్టేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ. 1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ. 35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ. 15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ. 1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఈ క్రమంలో పన్ను జరిమానా కేసులో (మిగతా 2లో)

### గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సిఎం

## అసహనం

### స్టాళ్లను పరిశీలించిన సిఎం చంద్రబాబు




**కర్నూల్ (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా 'మీ భూమి ? మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రైతుల్లో హర్షాతిరేకాలను కలిగించింది. గ్రామసభా ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ హక్కులు, భూ రికార్డుల తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'తలసరి ఆదాయం వివరాలన్నీ ముందుగానే నేను చదువుకొని వచ్చాను' అని పేర్కొంటూ, కాకి లెక్కలు కాకుండా కరెక్ట్ డేటా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిరికి సీఎం చంద్రబాబు స్పష్టంగా సూచించారు. అధికారులు సమగ్ర అవగాహనతో, బాధ్యతగా సమాచారం ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా ఆర్థిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన డేటా, స్పష్టమైన విశ్లేషణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బుడగ జంగాల అంశంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించానని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉందని (మిగతా 2లో)

# రైతన్నలకే భూమిపై హక్కు




(మొదటి పేజీ (తరువాయి)

మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు. మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ది, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ళ సీమగా మారిందని.. అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు - నగరి ప్రాజెక్ట్‌లు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురంను ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని చెప్పారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. గోదావరి పట్టిసీమ పెట్టి.. కృష్ణా డెల్టాకు ఇచ్చే100 టీఎంసీల నీరు రాయలసీమకు మళ్లించి ఆ ప్రాంతంలో కరువును తొలగించామన్నారు. కరువు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. నగదు కోసం.. కమిషన్‌లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర (టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ తీవ్రవాదులు ఉండే సమయంలో.. ఆ నగరాన్ని తాను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. వారికి తాను అడ్డు తగులుతున్నానని తిరుపతిలో తనపై దాడికి దిగారని.. కానీ ఆ వెంకటేశ్వర స్వామి తనను కాపాడారన్నారు. బల ప్రదర్శన అనేది ఎన్నికలలో చూపించుకోవాలని.. మిగతా సమయంలో ప్రజా సేవ చేయాలన్నారు. రాజకీయాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాట తీస్తానని వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా తాను ఉన్నానని.. కాబట్టే ఇప్పుడు హైదరాబాద్ ,సైబరాబాద్ నగరాలు ఉన్నాయని తెలిపారు. తాను చిత్రగుప్తుడిలా అన్నీ రాసుకుంటూ ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారు. సీబీఐ, సిట్ ఏమీ లేదని చెప్పారని అంటున్నారు. అందులో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించింది. బాత్‌రూమ్ క్లీన్ చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా చేశారు. శ్రీశైలంలో కూడా రసాయనాలతో ప్రసాదం కల్తీ చేశారు. నేను సీఎం అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాం. తితిదే ఈవోను మార్చి మంచి ఆఫీసర్‌ను తీసుకొచ్చాం. గతంతో పోలిస్తే లడ్డూలో చాలా వ్యత్యాసం ఉందని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఫరూక్, టిజి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# మద్రాస్ హైకోర్టులో విజయ్‌కు చుక్కెదురు

(మొదటి పేజీ (తరువాయి)

చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 015-16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ. 1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజయ్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి. సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ. 16కోట్ల పారితోషకంతో పాటు రూ. 4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

# రెపోరేట్‌లో కానరాని మార్పులు

## యథాతథంగా ద్రవ్య పరపతి విధానం.. ఆర్బీఐ గవర్నర్ సంజయ్




**ముంబై (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ. 75 వేల కోట్లుగా ఉంది.

# ఫ్రస్టేషన్‌తోనే వైసీపీపై దాడులు




(మొదటి పేజీ (తరువాయి)

జోగి రమేష్ ఇంటిపై దాడికి పాల్పడ్డ టీడీపీ నేతలు ఫతావుల్లా, ఆశకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను మీడియా ముందు జగన్ విడుదల చేశారు. లడ్డూ నెయ్యి వివాదంలో చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా తేలిపోయిందని జగన్ స్పష్టం చేశారు. తిరుమలలో వాడిన నెయ్యిలో జంతు కొవ్వు కానీ, పంది కొవ్వు కానీ, చేప నూనె కానీ ఏమాత్రం కలపలేదని సీబీఐ సిట్ ఛార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌ల నివేదికలు కూడా అదే నిజాన్ని నిర్ధారించాయని తెలిపారు. అయినా చంద్రబాబు కావాలనే అన్యాయమైన దుష్ప్రచారం చేసి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. చంద్రబాబు సీఎం కాకముందు వరకు తిరుమల ప్రసాదం ఎవరు ఇచ్చినా కళ్లకు అద్దుకుని తినేవారని, ఇప్పుడు అదే ప్రసాద పవిత్రతను దిగజార్చిన బాధ్యత చంద్రబాబుదేనన్నారు. రాజకీయాల కోసం ఒక అబద్ధాన్ని సృష్టించి దేవుణ్ని వాడుకున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు మాత్రమేనని జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీ ఛైర్మన్లుగా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని సీబీఐ నిర్ధారించిందని, అందుకే వారి పేర్లు ఛార్జ్‌షీట్‌లో లేవని, అరెస్టులు జరగలేదని జగన్ వివరించారు. టీటీడీ తిరిగి పంపిన ట్యాంకర్లు వేరే డెయిరీ పేరుతో వచ్చి లడ్డూల తయారీలో వాడారన్న ఆరోపణలపై కూడా సీబీఐ వాస్తవాలు వెలికి తీసిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై స్వామివారి ముందు చంద్రబాబు క్షమాపణ చెప్పి చెంపలేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌కే నిజమైన ప్రాధాన్యత ఉందని, చంద్రబాబు ఏర్పాటు చేస్తున్న వన్ మ్యాన్ కమిషన్ తన అబద్ధాలను నిజమని చెప్పించుకోవడానికి మాత్రమేనని, దానికి ఎలాంటి విలువ లేదని జగన్ స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టు నీకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు మరో కమిషన్ ఎందుకు? నీకు అనుకూల రిపోర్టు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నావా? అని చంద్రబాబును ప్రశ్నించారు. మరో మూడేళ్లలో తిరిగి వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, ప్రస్తుతం తప్పులు చేస్తున్న పోలీసులు, అధికారులు, నాయకులు, గుండాగిరి చేస్తున్న ప్రతి ఒక్కరినీ బోనులో నిలబెట్టి శిక్ష తప్పకుండా అమలు చేస్తామని జగన్ హెచ్చరించారు.

# పరామర్శలు కాదు.. బల ప్రదర్శనలు

**విజయవాడ (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పరామర్శల పర్యటనలు బలప్రదర్శనలుగా మారాయని, ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విజయవాడ పర్యటనపై కీలక వ్యాఖ్యలు చేశారు.. జగన్ పర్యటనకు తామెప్పుడూ ఆటంకం కలిగించమని స్పష్టం చేశారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి వీరాంజనేయ స్వామి హాజరై మాట్లాడారు. జగన్ పర్యటన వల్ల ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని మంత్రి చెప్పుకొచ్చారు. మాజీ సీఎం పర్యటన వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వంపై బురదజల్లితే చూస్తు ఊరుకోమని హెచ్చరించిన ఆయన.. జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎక్కువసేపు ఆపించద్దని సీఎం చంద్రబాబు తమను ఆదేశించారని.. ప్రజల సౌఖ్యమే మనకు కావాలని చెబుతారని మంత్రి ప్రస్తావించారు. జగన్ పెళ్లిళ్లు, ఫంక్షన్ల వద్ద కూడా తమ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ తన బుద్ధి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 2047 నాటికి ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు. 'ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మనం రెండో స్థానంలో ఉన్నాం. జీడీపీలో మూడో స్థానంలో చేరబోతున్నాం. మనమిత్ర, ఆదర్ సెంటర్స్, మీ సేవ వంటి టెక్నాలజీ మొత్తాన్ని మన శాఖ ద్వారా ఇంప్లిమెంటేషన్ చేస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 100 సేవలను మేము అందిస్తున్నాం. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఈ సేవలు అందిస్తున్నాం. వీటి తనిఖీల కోసం కోసం సుమారు 70 నుంచి 100 మంది సిబ్బంది కేటాయిస్తున్నాం. లోపాలు సరిదిద్ది సక్రమమైన మార్గంలో ప్రజల కోసం సరైన సేవలు అందిస్తాం. కొత్త సిబ్బందికి ఓరియెంటేషన్ ప్రోగ్రాం ద్వారా ట్రైనింగ్ ఇస్తున్నాం. క్వాలిటీ వర్క్ చేయించుకోవడానికే ఇంత మంది సిబ్బందిని కేటాయిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అందే పథకాలు అందుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం' అని మంత్రి తెలిపారు.

# హడలెత్తిస్తున్న పెద్దపులి సంచారం

## రంగంలోకి దిగిన అటవీశాఖ పట్టుకునేందుకు ఆపరేషన్ టైగర్

**రాజమండ్రి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**

రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం కృష్ణయ్య కాలనీ సమీపంలోని పొలాల్లో పులి తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గత ఆరు రోజులుగా పులి దాడుల్లో పశువులు మృతిచెందడంతో, ప్రజల భద్రత దృష్ట్యా అటవీ శాఖ 'ఆపరేషన్ టైగర్'ను ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. పులి జాడను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అటవీ శాఖకు చెందిన అనుభవజ్ఞులైన సిబ్బంది పొలాలు, అటవీ ప్రాంతాలు, పశువుల దాడులు జరిగిన ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపడుతున్నారు. రాజమండ్రి పరిసరాల్లో కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌పై స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. అత్యాధునిక సాంకేతికత, నిపుణుల బృందం, అటవీ శాఖ సమన్వయంతో పులిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సహకారంతో ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేస్తామని తెలిపారు. పులి రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు పూణెళి నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక నిపుణుల బృందం రాజమండ్రికి చేరుకుంది. ఈ బృందం నిన్న(గురువారం) రాత్రి 8:30 గంటల నుంచి అధికారికంగా టైగర్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. అడవి జంతువుల పట్టివేతలో అనుభవం కలిగిన ఈ బృందం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. పులి కదలికలను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు.. కీలక ప్రాంతాల్లో 25 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి వెళ్లే అవకాశమున్న దారులు, పశువుల దాడులు జరిగిన ప్రాంతాలు, నీటి వనరుల సమీపంలో ఈ కెమెరాలను అమర్చారు. వీటివల్ల పులి ఎక్కడ తిరుగుతుందో స్పష్టమైన సమాచారం లభించనుంది. పులి కదలికలను తక్షణమే గుర్తించేందుకు పది 4ఉ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఈ కెమెరాలను నేరుగా అధికారుల ఫోన్లకు అనుసంధానం చేశారు. దీంతో పులి కదలికలు నమోదైన వెంటనే సిబ్బందికి అలర్ట్ మెసెజ్ వస్తోంది. ఇది రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేయడంలో కీలకంగా మారింది. రాత్రి వేళల్లోనూ పులి జాడను గుర్తించేందుకు థర్మల్ డ్రోన్‌ను అటవీ శాఖ వినియోగిస్తోంది. ఈ డ్రోన్ ద్వారా పులి శరీర ఉష్ణోగ్రతను గుర్తించి, దాని కదలికలను ట్రాక్ చేయగలుగుతున్నారు. అడవులు, పొలాల్లో దాగి ఉన్న పులిని గుర్తించేందుకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోంది. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. మత్తుమందు ఇచ్చిన తర్వాత పులిని బంధించేందుకు మూడు ప్రత్యేక బోన్లను ఏర్పాటు చేశారు. ఈ బోన్ల వద్ద పీటీజెడ్ కెమెరాలు అమర్చారు. పులి బోన్ల సమీపానికి వచ్చిన వెంటనే అధికారులు వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. గత ఆరు రోజుల వ్యవధిలో పులి తొర్రేడు రఘునాథపురం పుణ్యక్షేత్రం, జి.ఎర్రంపాలెం గ్రామాల పరిధిలో మొత్తం ఎనిమిది పశువులపై దాడి చేసి చంపినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటనలతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పులి దాడుల నేపథ్యంలో గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దని, పులి కనిపిస్తే వెంటనే అటవీ సిబ్బందికి సమాచారం అందించాలని సూచిస్తున్నారు. పులి దాడిలో మృతిచెందిన పశువుల యజమానులకు నష్టపరిహారం అందజేస్తామని అటవీ శాఖ అధికారులు భరోసా ఇచ్చారు. బాధిత రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజా తిరస్కరణ మరిచారా పీకె

(మొదటి పేజీ (తరువాయి)

నియమావళి ఉల్లంఘన అంటూ పిటీషన్‌లో ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణల ఆధారంగా మొత్తం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేసి, తిరిగి పోలింగ్ నిర్వహించాలన్న డిమాండ్‌ను ధర్మాసనం పూర్తిగా తోసిపుచ్చింది. "ఒక పార్టీ అభ్యర్థన మేరకు మొత్తం రాష్ట్రానికి వర్తించే విస్తృత ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదు. ఇది రాష్ట్ర స్థాయి వివాదం. అవసరమైతే పాట్నా హైకోర్టును ఆశ్రయించండి" అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత ఏడాది జరిగిన 243 స్థానాల బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 202 సీట్లు గెలుచుకుని అధికారంలోకి రాగా, ఇండియా కూటమి కేవలం 35 స్థానాలకే పరిమితమైంది. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆ పార్టీ అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. కాగా, ఈ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ స్వయంగా పోటీ చేయకపోవడం గమనార్హం.

# రాజకీయ మంటలు

(మొదటి పేజీ (తరువాయి)

చేయగా, జనసేన పార్టీ కూడా తాత్కాలికంగా అరవ శ్రీధర్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచింది. ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన అరవ శ్రీధర్, తనపై నమోదైన కేసు రాజకీయ కక్షతో పెట్టినదని, నిరాధార ఆరోపణల ఆధారంగా తన ప్రతిష్ఠను దెబ్బతీయాలని యత్నిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే, విచారణ పూర్తయ్యే వరకు అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అరెస్టు చేయాల్సి వచ్చినా, దానికి గల కారణాలను తప్పనిసరిగా రాతపూర్వకంగా నమోదు చేయాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తరపు న్యాయవాదులు, తమ క్లయింట్‌పై రాజకీయ ప్రత్యర్థుల ప్రేరణతోనే ఈ కేసు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పూర్తి విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొనడంతో, ఈ కేసు దిశను హైకోర్టు ఆదేశాలు మలుపు తిప్పనున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది.

# జగన్ హయాంలో కల్తీ రిక్రూట్‌మెంట్

(మొదటి పేజీ (తరువాయి)

సీఎఫ్‌టీఆర్‌ఐతో పాటు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ, సిట్ నివేదికలు అన్నీ కల్తీని ధ్రువీకరించాయని స్పష్టం చేశారు. జంతు కొవ్వు అవశేషాలు నిర్ధారించే సామర్థ్యం తమ వద్ద లేదని మాత్రమే ఎన్‌డీఆర్‌ఐ చెబితే.. దానిని పట్టుకుని జంతుకొవ్వు లేదని ప్రచారం చేసుకుంటారా అని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదనటానికి తాడేపల్లి ప్యాలెస్‌లో ముద్రించే సాక్షి కరపత్రం కాకుండా మరేదైనా నివేదిక వైకాపా వద్ద ఉందా అని ప్రశ్నించారు. టాయిలెట్ క్లీనింగ్‌కు వాడే 'లబ్సా' అనే రసాయనం వాడి మహా అపచారానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయ్ హత్యకు ముందు ఎలాంటి మైండ్ గేమ్ ఆడారో.. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ అలాంటి మైండ్ గేమ్ ఆడుతున్నారని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న ఇలాంటి వారిని రాజకీయాల్లో లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని హోం మంత్రి అన్నారు. ఇంత జరిగినా కనీసం పాశ్చాత్తాపం ప్రకటించడం లేదన్నారు. ఎదురుదాడితో ఏం సాధిస్తారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆమె అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తుచేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు భక్తులు తిరుమలకు రావాలంటే అనుమానించే పరిస్థితి ఏర్పడిందని, జగన్ తప్పులు చేసి తమపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దుర్మార్గాలు చేసి తిరిగి ఎదురుదాడి చేస్తున్నారని, శ్రీవారిపై జగన్‌కు నమ్మకం ఉంటే డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని అనిత విమర్శించారు.

# కూటమి పాలనలో గూండా రాజ్యం

(మొదటి పేజీ (తరువాయి)

మాట్లాడారు. ఏకంగా మాజీ మంత్రి ఇంటిపైనే దాడులకు తెగబడటం దారుణమని రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాజీ మంత్రి ఇంటికే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా ఫెయిల్ అయింది. పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం" అని అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నీచంగా మాట్లాడారని రోజా మండిపడ్డారు. "వాళ్ల పార్టీకి వాళ్లే సమాధి కట్టుకున్నారు. రాష్ట్ర ప్రజలకు ఈ ఇద్దరూ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి. కానీ అలాంటి వ్యాఖ్యలు చేసిన వారిని వేంకటేశ్వరస్వామి క్షమించడు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ పర్యటనకు జనం రాకుండా అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారని, కానీ ప్రజలు జగన్ వెంటే ఉన్నారని రోజా స్పష్టం చేశారు. "ప్రజల మద్దతు ఎవరికుందో వాళ్లు గుర్తించాలి" అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇలాంటి దుస్థితి ఎన్నడూ చూడలేదని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. "ఏపీలో రాజ్యాంగం కాదు, రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దాడులు, బెదిరింపులు పరిపాటిగా మారాయి. రాష్ట్రంలో చట్టవ్యవస్థ పూర్తిగా కూలిపోయింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరం తలెత్తింది" అని ఆమె వ్యాఖ్యానించారు.

# లెక్కలపై సిఎం అసహనం

(మొదటి పేజీ (తరువాయి)



స్పష్టం చేశారు. ఎస్సీలకు రిజర్వేషన్లు మినహా అందే అన్నిప్రయోజనాలు బుడగ జంగాలకూ అందేలా నిన్ననే సంతకం చేశానని వెల్లడించారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



చేనేత గర్జన పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

## చేనేత గర్జన పోస్టర్లు విడుదల

**పెద్దపప్పూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
పెద్దపప్పూరు మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో శుక్రవారం చేనేత గర్జన పోస్టర్లను జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరు రుసింగప్ప విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, ఏడాదికి ఒక్కో నేత కార్మికుడికి రూ:25,000 చొప్పున 200 కోట్లు చేనేత రంగానికి నిధులు విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన నేత కార్మికులందరికీ నేతన్న నేస్తం పథకం ద్వారా 25,000 చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు నేతనలను పట్టించుకోలేదన్నారు. ఇదే విషయమై పలు డిమాండ్లతో ఈనెల 22న చేనేత గర్జనలో భాగంగా చలో మంగళగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు బద్దెల శ్రీనివాసులు, నీలూరు భాస్కర, మద్దన భార్గవ, జగన్మోహన్ రెడ్డి, అబీబ్, చింతా రమేష్, చింతా నారాయణస్వామి, దూల శ్రీనివాసులు, సింహం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసిన గుత్తి పోలీసులు

## బాలికను గర్భవతి చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
గుత్తి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బాలికలను గర్భవతి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను గుంతకల్లు డిఎస్పి శ్రీనివాసులు వెల్లడించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బాలిక గుత్తి పట్టణంలో చదువుకుంటోంది. ప్రతిరోజు ఆమెను ఆటోలో గుత్తిలోని కళాశాలకు తీసుకెళ్లి తిరిగి ఇంటి వద్ద దించుతుండేవాడు. ఈ క్రమంలో బాలికను లోబర్చుకొని ఆమెను గర్భవతిని చేసాడు. ఇటీవల బాలిక తనకు కడుపునొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో వైద్యుల వద్దకు తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారంే నాగసముద్రం రోడ్డు వద్ద ఆటో డ్రైవర్ అరెస్ట్ చేసి కోర్టు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో గుత్తి సీఐ రామారావు, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప తెలుగుదేశం పార్టీ నాయకులు


## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
గుత్తి పట్టణంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలోశుక్రవారం గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచనల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కోణంకి నాగేశ్వరరావు, కోణంకి కృష్ణ. సామాజిక సేవ కార్యకర్త జానకిరామ్, నాగరాజుతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుత్తి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప , ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యనిర్వాహక సభ్యురాలిగా కవిత

*బిజెపి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు..*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
బెళుగుప్పకు చెందిన శనగప్పగారి కవితను భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా కార్యనిర్వాహక సభ్యురాలిగా జిల్లా కమిటీ నియమించింది. శుక్రవారం అనంతపురం నగరంలో బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిధ రాజు ఆదేశాలతో, బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దగ్గుబాటి సౌభాగ్య ఆధ్వర్యంలో బిజెపి మహిళా మోర్చా కార్యనిర్వాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ మహిళా మోర్చా కార్యనిర్వాహక సభ్యురాలిగా బెళుగుప్ప కు చెందిన ఎస్. కవిత ను ఏకగ్రీవంగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యనిర్వాహక సభ్యురాలుగా తనను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసిన రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషీధ రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దగ్గుబాటి సౌభాగ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై తనకెంతో నచ్చిందని, తనపై ఎంతో నమ్మకంతో, క్రమశిక్షణతో నిబద్ధతతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని జిల్లా మహిళా మోర్చా కార్యనిర్వాహక సభ్యురాలు ఎస్. కవిత పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సేవలను అందిస్తానని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆమె కృతజ్ఞతలు తెలిపారు




బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకండ్ల రాజేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దగ్గుబాటి సౌభాగ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న బిజెపి జిల్లా మహిళా మోర్చా కార్యనిర్వాహక సభ్యురాలు శనగప్పగారి కవిత

# సి.యస్.ఐ.టి.ఎ. షాపింగ్ మాల్ ప్రారంభం

### ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. రాయలసీమ డయాసిస బిషప్ దేవ వరప్రసాద్..

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్ సమీపంలో గల ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, సిఎస్ఐ ఆర్టిఏ రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, బిషప్ ఐజాక్ వరప్రసాద్‌కు ముందుగా సి యస్ ఐ టి ఎ చర్చి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చర్చిలో



షాపింగ్ కాంప్లెక్స్ గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, బిషప్ ఐజాక్ వరప్రసాద్ తదితరులు



అతిథులను ఊరేగిస్తున్న క్రిస్టియన్ మైనారిటీ ప్రతినిధులు

ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి నుండి నూతన కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీగా వచ్చి షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గదులు తీసుకున్న వ్యాపారస్తులు మంచిగా వ్యాపారాలు చేసుకుంటే చర్చి ఆధ్వర్యంలో ఇంకా అభివృద్ధి చేస్తారన్నారు. వ్యాపారస్తులకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించబోయే షాపింగ్ కాంప్లెక్స్‌లకు భూమి పూజ చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రిస్టియన్లను ఆదుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఏరియా సి ఎస్ ఐ ఎల్ డి ఇంచార్జ్ రసల్ కిరణ్ డేవిడ్ సన్. రాస్ట్రా క్రిస్టియన్ మైనారిటీ సెల్ నాయకులు స్వామి దాసు, సి యస్ ఐ టి ఎ చర్చి ఫాదర్స్ , సభ్యులు ,గుత్తి పట్టణం, మండల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం

### సీఎంఓ చంద్రశేఖర్...

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంత అవసరమని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బెళుగుప్ప మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఈఓ 2 హరికృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో విద్యాంజలి 2.0 కార్యక్రమంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎ సీఎంఓ చంద్రశేఖర్, ఏఎంఓ నారాయణస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలలో గ్రామ ప్రజలను ఏ విధంగా భాగస్వామ్యం చేయాలి, వివిధ రకాల అభివృద్ధిలో దాతల సహకారం ఎంతవరకు అవసరం ఉంటుంది అనేటువంటి విషయాలపై ప్రధానోపాధ్యాయులకు వివరించారు. ఉపాధ్యాయులు వజీర్ భాష, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. అనంతరం సీఎం ఓ చంద్రశేఖర్ ఏ ఎం ఓ నారాయణస్వామి పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎ సి ఎం ఓ చంద్రశేఖర్, ఏ ఎం ఓ నారాయణస్వామి, ఎంఈఓ 2 హరికృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటప్రసాద్, రిసోర్స్ పర్సన్లు వజీర్ భాష, సిరిపురం నాగరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




విద్యాంజలి 2.0 ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం ఓ చంద్రశేఖర్, ఎంఈఓ హరికృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటప్రసాద్



బెళుగుప్ప హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ సీఎంఓ చంద్రశేఖర్ ఏఎంఓ నారాయణస్వామి

# మహనీయుల త్యాగాలు వృధాపోలేదు

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ.. తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
స్వాతంత్ర సమరయోధుడు భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల త్యాగాలు వృధా పోలేదని అందుకు సాక్షాత్కారమే ఆయన విగ్రహావిష్కరణ అని శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి అన్నారు. మహనీయుల త్యాగాలు, స్వరాజ్యం తేవడంలో వారు నిర్వర్తించిన కర్తవ్యాలు , నేడు కూడా మనము స్మరించుకుంటున్నామంటే వారి అంకితభావానికి మచ్చుతునక అని అన్నారు.
శుక్రవారం యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో స్థానికులు ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణ తోనే మన కర్తవ్యం ఆగిపోకూడదని, అలాంటి మహనీయులను స్మరించుకుంటూ నిత్యం ఆ విగ్రహాలను , పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచే ఏర్పాటు చేయాలని అప్పుడే ఆ మహనీయులను మనము గౌరవిస్తున్నట్లు గుర్తుంచుకోవాలన్నారు.



యాడికిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి



యాడికిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న జెసి అస్మిత్ రెడ్డి

విగ్రహం ఏర్పాటుకు మండల వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ అభిమానులు సంఘం కార్యకర్తలు ఆర్థికంగా తలో చేయి వేసివేసినట్లు తెలిపారు. అయితే విగ్రహ ప్రారంభోత్సవ సమయంలో నిర్వహించిన తీరు , , ఓ పార్టీ సమావేశంల జరిగిందంటూ అంబేద్కర్ అభిమానులు ,మహిళా అభిమానులు కార్యకర్తలు తిట్టుకుంటూ పోవడం గమనార్హం. విగ్రహావిష్కరణ అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి. ఎంపీడీవో వీరరాజు. డిప్యూటీ ఎంపీడీవో శశికళ. డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు. ఆర్ ఐ కిష్టప్ప. సీఐ శ్రీనివాసులు. యాడికి సర్పంచ్ పండు అనురాధ. టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ యాదవ్. వైసిపి నాయకులు బాల రమేష్ బాబు. మాజీ జెడ్పిటిసి వెన్నపూస వెంకట్రామిరెడ్డి. ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య. నరసింహులు. శ్రీరాములు. బాలు నాగరాజు. మురళి. లక్ష్మణ్. రామాంజనేయులు. సూరి. కంబగిరి రాముడు. జగదీష్. ప్రసాద్. వెంకట్రాముడు. వివిధ నాయకులు తోపాటు మాల మహానాడు నాయకులు జిల్లా నాయకులు నాగప్ప. రామాంజనేయులు, మండల నాయకులు సురేష్. బాలన్న. విజయ్. రత్న. తదితరులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గజమాలలు సమర్పించారు.



యాడికిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న అభిమానులు పాల్గొన్న వైసిపి నాయకులు బాల రమేష్ బాబు మాజీ జడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి తోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను సత్కరిస్తున్న క్రిస్టియన్ మత పెద్దలు

## ఎమ్మెల్యే జయరాంకు సన్మానం

*చర్చి ఫాదర్లు..*

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
గుత్తి పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను గుత్తి మండలానికి చెందిన పలువురు చర్చి ఫాదర్లు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గుత్తిలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జయరాంను సీఎస్ఐ చర్చి రాయలసీమ డయాసిస్ చెందిన వివిధ చర్చిల ఫాదర్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణనికి చెందిన రసల్ కిరణ్ చర్చి ఫాదర్లు డేవిడ్ నాయక్‌తో పాటు పలువురు మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం నిర్వహించు ఆలయ ప్రాంగణం

## నేడు బూదిగుమ్మలో సుందరకాండ హోమం

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
బూదిగుమ్మ శ్రీ సంజీవరాయుని ఉత్సవాల సందర్భంగా శనివారం బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి దేవాలయం వద్ద లోక కళ్యాణార్థం సుందరకాండ హోమం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. లోక కల్యాణం కాంక్షిస్తూ సుందరకాండ హోమం ప్రప్రథమంగా, ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం వేద పండితులు శ్రీ నిరంజన శర్మ గ ఆధ్వర్యం లో నేడు మరియు 8 తేదీలలో రెండు రోజుల పాటు జరుగుతుందని ,8 వ తేదీ ఆదివారం పూర్ణాహుతి ఉంటుందని తెలుపుతూ,ప్రతి సంవత్సరం ఈ హోమం నిర్వహించాలని సంకల్పించామని అందుకు భక్తులు ముందుకు రావాలని కోరారు.కోరికలు తీర్చే సంజీవరాయుని అనుగ్రహ ఫలాలను భక్తులు అందరూ ఈ హోమం లో పాల్గొని పొందాలని కోరారు.విశేష ఫలాలను ఇచ్చే ఈ హోమం నిర్వహించేందుకు ఆలయ పెద్దలు ఎర్రిస్వామి,శివశంకరప్ప,అర్చకులు జ్ఞానేశ్వర్ స్వామి,వాసు స్వామి, ఆలయ అధికారి బాబు మంచి తోడ్పాటు అందిస్తున్నట్టు బూదిగుమ్మ సేవా సమితి సలహాదారు మురళీకృష్ణ ,సభ్యులు, దేశాయి ప్రకాష్ రావు, ఘట్టంరాజు సంజీవరావు, దుర్గాప్రసాద్ , మధు తదితరులు తెలిపారు.

## తరగతి గదిలో కుప్పకూలిన పదవ తరగతి విద్యార్థి

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
10వ తరగతి అంటే భయమో, స్కూలుకు వెళ్లాలంటే భయమో తెలియదు కానీ 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి తరగతి గదిలో కుప్పకూలిన సంఘటన బెళుగుప్ప మండలం పరిధిలోని గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల మేరకు గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయదుర్గం మండలం గుండ్లపల్లి గ్రామానికి సమీప గ్రామమైన కాశీపురం కు చెందిన పదవ తరగతి విద్యార్థి యధావిధిగా పాఠశాలకు వచ్చాడు. అయితే కొంతసేపటికి తరగతి గదిలో కుప్పకూలి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే ఉపాధ్యాయులు సహా విద్యార్థులు గ్రామంలోని ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకొని వెళ్లగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్య చికిత్సలు అందించారు. అయితే ఆ విద్యార్థి పాఠశాలకు వచ్చే ముందు క్రిమిసంహారకమందును సేవించినట్లు తెలిసింది. ఏది ఏమైతేనేమి ఆ విద్యార్థి కి ఎటువంటి ప్రమాదం లేకుండా కోరుకుంటున్నాడు. కళ్యాణ్ దుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో కోలుకుంటున్న ఎంఈఓ హరికృష్ణ పరామర్శించి కారణాలను తెలుసుకున్నారు. విద్యార్థితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు...

## పెద్దపేట ఎస్సీ కాలనీలో ట్యాంకర్లతో నీటి సరఫరా

*వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి..*

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
యాడికి మేజర్ పంచాయతీ లోని పెద్దపేట గ్రామంలో గత వారం రోజుల నుండి జమ్ము చెట్టు వద్ద నుండి ఎస్సీ కాలనీ వరకు పైప్ లైన్ లీకేజీ వల్ల నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడడంతో గ్రహించిన పెద్ద పేట గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పెద్దపేటలోని ఎస్సీ కాలనీలో నీళ్ల సమస్య ఉండటం వలన ఆమె దృష్టికి రావడంతో ఆమె సొంత ఖర్చులతో నాలుగు ట్యాంకర్లు నీళు తెప్పియడం జరిగినది ఎస్సీ కాలనీలో నీళ్ల సమస్య లేకుండా పరిష్కరించారు.



వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీరుసరఫరా



# ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

*సిజి ప్రాజెక్ట్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సాదియా సమ్రీన్..*

**తనకల్లు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** తనకల్లు మండలంలో ఉన్న సిజి ప్రాజెక్ట్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాధియా సమ్రీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు 80 సీట్లు ఉన్నాయని, ఇందులో రిజర్వేషన్స్ ఆధారంగా ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 12శాతం, బిసిలకు 5 శాతం, ఓసిలకు 5 శాతం, ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు 3 శాతం సీట్లు కేటాయించామన్నారు. అడ్మిషన్స్ కావలసిన విద్యార్థులు ప్రభుత్వ గిరిజన గురుకుల వెబ్‌సైట్‌లో ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 4వ తేదీన గిరిజన గురుకుల పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ సెల్ నెంబర్:8500941752, 8333807978, 9652580709ను సంప్రదించాలన్నారు.



చురుగ్గా సాగుతున్న వంటశాల నిర్మాణం పనులు

# రూ.10 లక్షలతో వంటశాల నిర్మాణం పనులు

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** మండల పరిధిలోని హేమావతి ఎంజేరు సిద్దేశ్వర స్వామి అన్నదాసోహం భవనం పక్కన వంటగది నిర్మాణానికి పావగడ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 10 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు అధ్యక్షులు బి. హెచ్. కృష్ణారెడ్డి తెలిపారు. హేమావతి క్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. అన్నదాసోహ సమితి కి ప్రత్యేకంగా వంటశాల లేకపోవడంతో దాని నిర్మాణ కోసం ఆర్థికసాయం అందించామన్నారు. పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.



వంటశాల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

# వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం వికసిత భారత్ రోజ్ గార్ అజీవిక మిషన్ ముఖ్య ఉద్దేశమని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం బత్తలపల్లిలో నిర్వహించిన వికసిత భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (విబి--జిఆర్‌ఏఎంజి) అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే వికసిత భారత్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకాలు గ్రామీణ కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తున్నాయని చెప్పారు.ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని, గ్రామీణ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని,పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న ఈ సమయంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తనను ఆశీర్వదించిన ధర్మవరం ప్రజల రుణం తీర్చుకునేలా శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వికసిత భారత్ లక్ష్య సాధనలో ధర్మవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా, అవినీతికి తావులేకుండా పథకాలను ప్రజలకు చేరవేస్తామని, ధర్మవరం అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ఆర్థిక సమానత్వం సాధించడమే వికసిత భారత్ అసలు లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, విజయ ప్రసాద్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బిజెపి నాయకులు సంధి రెడ్డి శ్రీనివాసులు, జిఎం శేఖర్, మండల బిజెపి కన్వీనర్ ఆకులేటి భాస్కర్, మండల కార్యదర్శి రామచంద్ర, మాజీ నియోజకవర్గ కన్వీనర్ కావేటి మల్లికార్జున, బిజెపి సీనియర్ నాయకులు ఆకులేటి వీరనారప్ప, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి,మాజీ సింగల్ విండో అధ్యక్షులు వెంకట చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్వర చౌదరి, జడ్పిటిసి కోటి సుధ, ధర్మవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, టిడిపి నాయకులు కాకర్ల సురేంద్ర, నెట్టెం రమణ, చల్లా శ్రీనివాసులు, సుబ్బరాయుడు, దేవేంద్ర, రామకృష్ణ, పురం శెట్టి రవి తదితర కూటమి నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన ప్రజలు



నాయకులతో మాట్లాడుతున్న పార్లమెంట్ ఇంచార్జ్ రమేష్ రెడ్డి

# పిల్లిగుండ్లులో వైకాపా రచ్చబండ కార్యక్రమం

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** మండల పరిధిలోని పిల్లిగుండ్లు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జడ్పీటీసీ అనంతరాజు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రచ్చబండ కార్యక్రమం తీసుకువచ్చారని, అయన అడుగుజాడల్లో తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రచ్చబండ ద్వారా ప్రజాసమస్యలు తెలుసుకోవడం, పార్టీని బలోపేతం చేయడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాకమిటీలను నిర్మించుకొని స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడం లో పూర్తిగా విఫలమైందన్నారు.అనంతరం పార్లమెంట్ ఇంచార్జ్ రమేష్ రెడ్డి జె సి ఎస్ కన్వీనర్ నాగేంద్ర స్వగృహం లో సమావేశం ఏర్పాటు చేసి నాయకులకు,కార్యకర్తలకు దిశనిర్దేశ్యం చేశారు. ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కుతాయన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే నాయకులు, కార్యకర్తలు గుర్తిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సమన్వయ కర్త ఈరలక్కప్ప, జడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, న్యాయవాది అశ్వార్థనారాయణ, కన్వీనర్ నరసింహరెడ్డి,జె సి ఎస్ కన్వీనర్ నాగేంద్ర,న్యాయవాది రంగనాథ్, మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్,వైస్ సర్పంచ్ రవికుమార్, నాయకులు నగేష్, ఎరగుంటేశ్వర,ముద్దిరెడ్డి, శ్రీనివాస్,శేఖర్ పాల్గొన్నారు.



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ అనంతరాజు

# టేకులోడు అడవిలో ఉత్కంఠ..!

## పోలీసులపై కత్తితో దాడి.. గ్యాంగ్ రేప్ నిందితుడిపై కాల్పులు..

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** శ్రీ సత్య సాయి జిల్లా చిలమత్తూరు మండలం టేకులోడు అటవీ ప్రాంతంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. 2024 సంవత్సరంలో టేకులోడు వద్ద అత్తాకోడలిపై జరిగిన గ్యాంగ్ రేప్ కేసులో ప్రధాన నిందితుడైన కావడి నాగేంద్రను పట్టుకునే క్రమంలో పోలీసులపై కత్తితో దాడి జరగగా, స్వీయ రక్షణలో పోలీసులు కాల్పులు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలు కాగా, వారు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు, గ్యాంగ్ రేప్ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన కావడి నాగేంద్ర గత కొంతకాలంగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అతన్ని పట్టుకునేందుకు పోలీసులు మూడు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. పక్కా సమాచారంతో శుక్రవారం తెల్లవారుజామున చిలమత్తూరు ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు టేకులోడు అటవీ ప్రాంతానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా, నిందితుడు కానిస్టేబుల్ రవిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో రవికి తీవ్ర గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న వెంటనే సీఐ ఆంజనేయులు అటవీ ప్రాంతానికి చేరుకుని గంటన్నర పాటు గాలింపు చేపట్టారు. నిందితుడు లొంగిపోవాలని హెచ్చరిస్తూ పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపినప్పటికీ, కావడి నాగేంద్ర తప్పించుకునే ప్రయత్నం చేస్తూ మరోసారి పోలీసులపై దాడికి యత్నించాడు. ఈ ఘటనలో సీఐ ఆంజనేయులకు ఛాతీ వద్ద, చేతికి గాయాలయ్యాయి. పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారడంతో స్వీయ రక్షణలో భాగంగా నిందితుడి మోకాలి పై కాల్పులు జరిపి అతడిని అదుపులోకి తీసుకుని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

నిందితుడు కావడి నాగేంద్రపై శ్రీ సత్య సాయి జిల్లాలో 41 కేసులు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసులతో కలిపి మొత్తం 70 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేయరాదని, పోలీసుల ప్రాణ రక్షణ కోసమే మొదట గాల్లోకి, అనంతరం నిందితుడి మోకాలి పై కాల్పులు జరిపినట్లు జిల్లా ఎస్పీ మీడియా సమావేశంలో తెలిపారు. నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో గాయపడి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవిని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం టేకులోడు అటవీ ప్రాంతంలోని సంఘటన స్థలాన్ని పరిశీలించి, నిందితుడు దాడికి పాల్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్, కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



కాల్పులు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్




గాయపడిన పోలీసులను పరామర్శిస్తున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

# 9 నుంచి ఎఫ్ఏ-4 పరీక్షలు

*ఎంఇఓ శ్రీధర్ ..*

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** ఎఫ్ఏ-4 పరీక్షలు ఈనెల 9 నుండి 12 వరకు నిర్వహించనున్నట్లు ఎం ఇ ఓ శ్రీధర్ తెలిపారు. (1 నుండి 5 , 6 నుంచి నుండి 9 తరగతులు). 3, 4, 5 తరగతుల విద్యార్థులకు టిఎఆర్ఎల్ ఎండ్ లైన్ నిర్వహించాలన్నారు. ఇందుకోసం ఇదివరకే పంపిణీ చేసిన ప్రశ్నా పత్రాల నందు ఒక విద్యార్థికి ఉదాహరణకు బేస్ లైన్ పరీక్షలో ఒకటవ టూల్, మిడ్ లైన్ పరీక్ష యందు 3వ శాంపుల్ ఉపయోగించినట్లయితే ఆ విద్యార్థికి ఇప్పుడు 2, లేదా 4వ శాంపుల్ ఉపయోగించవలసి ఉంటుందన్నారు. ఈ వివరాలను టూల్ 2లో టి ఎ ఆర్ ఎల్ పరీక్ష నిర్వహించి నమోదు చేయాలన్నారు.అదేవిధంగా, పదవ తరగతి ప్రీ-ఫైనల్ పరీక్షలు 09 నుండి 19 వరకు నిర్వహించ బడతాయన్నారు. ఉదయం 9:30 నుండి 10 :45 నిమిషాలు ఉదయం సెషన్స్ మధ్యాహ్నం 1:15 నుండి 2 గంటలవరకు జరుగుతాయన్నారు. ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాల 1నుండి 5వ తరగతి ప్రశ్నపత్రాలు తమ క్లస్టర్ నుండి పరీక్ష జరిగే రోజు ఒక గంట ముందు తీసుకెళ్లాలి. అదేవిధంగా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా సబ్జెక్టులు జరిగే పరీక్ష రోజు మండల విద్యాశాఖ కార్యాలయం నుండి ఒక గంట ముందు ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లాలి పిడిఎఫ్ లో వివరణాత్మక టైమ్ టేబుల్, సిలబస్ సూచనలు దీనితో పాటు జతచేయబడ్డాయని కావున ప్రశ్న పత్రాలు ఎట్టి పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల్లో పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ సామాజిక మాధ్యమాల్లో కనబడితే ఆయా ఉపాధ్యాయులపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేదా ఆటంకాలకు తావులేకుండా పరీక్షలు సజావుగా నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరారు.



# ఘనంగా చాముండేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** మండలపరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించిన చాముండేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 5గంటల నుండి 5:30 వరకు ప్రాణప్రాతిస్టాపన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు.అనంతరం గురుగణపతి ప్రార్థన, దేవానంది, పంచాగవ్య మేళన, అంకురార్పణ, కళాశ స్థాపన, నవగ్రహ ఆరాధన, అనంతరం మహామంగళారతి సాయంత్రం కళాశారాధన, ప్రాణప్రతిష్ఠ, మంగళహారతి, ఆదిత్యాది గణపతి హోమం నిర్వహించారు.మహిళాలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అర్పించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో జడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీ సుమనాగరాజు,వైస్ ఎంపీపీ సౌమ్య, ఎంపీటీసీ లక్ష్మి, కన్వీనర్ నరసింహారెడ్డి, న్యాయవాది రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



చాముండేశ్వరి దేవిని ప్రతిష్ఠించిన దృశ్యం



కొత్తగా నిర్మించిన దేవాలయం



జడ్పీటీసీ,ఎంపీపీ,ఎంపీటీసీ, నాయకులు సన్మానించిన దృశ్యం





హోమం నిర్వహిస్తున్న పురోహితులు. అమ్మవారికి జ్యోతులు తీసుకువస్తున్న మహిళలు

# జగన్ పాలన ప్రజారంజకమే

## దుష్టపాలన కాదు.. దేవదేవుడి పేర కూటమి నాయకుల విష పచారం.. బహిరంగ క్షమాపణ చెప్పాలి జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి ఆవుటాల రమణారెడ్డి..



**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన దుష్ట పరిపాలన కాదని, ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకున్న ప్రజారంజక పాలన అని శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి ఆవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో నెయ్యి కల్తీ జరిగిందని, అందులో జంతు కొవ్వులు కలిపినట్టు చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యమని ఆయన మండిపడ్డారు. అసలు అలాంటి కల్తీ జరిగితే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు దేవుని ఎదుట ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. ఈ అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ విచారణ జరిపి, ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించగా, జంతు కొవ్వులు కలవలేదని స్పష్టమైన నివేదిక వచ్చిందని గుర్తు చేశారు. అయినా కూడా ఈ నివేదిక వెలువడిన తర్వాత సైతం అప్పటి టీటీడీ పాలకమండలిపై, వారి నిబద్ధతపై విష ప్రచారం చేయడం దుర్మార్గమని విమర్శించారు. అప్పటి పాలక మండలి సభ్యులైన ప్రస్తుత మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా అని కూటమి నేతలను నిలదీశారు. జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక దేవదేవుడి పేరుతో ప్రపంచవ్యాప్తంగా హిందూ మనోభావాలను దెబ్బతీసేలా ప్రచారం చేశారని ఆరోపించారు.

ఈ విష ప్రచారం కారణంగా దేశవ్యాప్తంగా మత గురువులు, పీఠాధిపతులు సంప్రోక్షణలు, యాగాలు చేయాల్సి వచ్చిందని, దీనికి బాధ్యులైన కూటమి నాయకులు తప్పకుండా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అలాగే, వైఎస్ఆర్సిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు, యజ్ఞాలు నిర్వహించి హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేవుని ఆశీస్సులు కోరారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించి, జగన్మోహన్ రెడ్డిపై మరింత నమ్మకం బలపడిందన్నారు. అయితే దీనిని తట్టుకోలేక కూటమి నాయకులు మరోసారి డైవర్షన్ రాజకీయాలకు తెరలేపుతూ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసి, ఆస్తులు ధ్వంసం చేయడం, హత్యాయత్నాలకు పాల్పడడం ప్రజాస్వామ్యంపై దాడి కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో "రెడ్‌బుక్ రాజ్యాంగం" అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

162 సీట్లు గెలిచినా పరిపాలన చేతకాక 18 నెలల్లోనే మూడు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై భారాన్ని మోపుతున్నారని, అమరావతి రాజధానికి మాత్రమే వేల కోట్లు ఖర్చు పెట్టి మిగతా రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు.

రాయలసీమకు చెందిన నేతలుగా ఈ దోపిడీని అడ్డుకుని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, 25 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించే విధంగా ఒత్తిడి తేవాలని సూచించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గత 18 నెలల్లో జరిగిన అభివృద్ధి ఏంటో చెప్పగలరా అని ప్రశ్నిస్తూ, 2019--24 మధ్య మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి హయాంలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు పథకం, ఆరోగ్యశ్రీ, జాతీయ రహదారులు, జిల్లా సాధన వంటి అంశాలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

ఇంతవరకు పుడా చైర్మన్ నియామకం కూడా చేయలేకపోయారని, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి ఉత్సవాల పేరుతో కేవలం 10 కోట్లు కేటాయించి నాసిరకం పనులు చేసి మధ్యలో వదిలేయడం అభివృద్ధి కాదన్నారు. కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టు, కృషి విజ్ఞాన కేంద్రం, పండ్ల తోటల పరిశోధన కేంద్రం వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లాలో మామిడి తోటలకు నష్టం వాటిల్లిన రైతుల విషయంలో, హెక్టారుకు రూ.4500 చొప్పున ఇన్సూరెన్స్ చెల్లించిన సుమారు 3 వేల మంది రైతులకు బీమా విడుదల చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆవుటాల రమణారెడ్డి డిమాండ్ చేశారు.



కబడ్డీ క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న సుందర్ రాజ్ దొర

## కబడ్డీ జట్లకు క్రీడా దుస్తులు పంపిణీ

*పిఎస్ సుందర్ రాజ్ దొర..*

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
కోసిగిలో జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమాంబ రథోత్సవం సందర్భంగా గ్రామీణ క్రీడలు అయిన కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో పాల్గొనే జట్లకు సంబంధించిన క్రీడాకారుల కు శుక్రవారం నాడు హైస్కూల్ మైదానంలో కోసిగి దొరల వంశస్థుడు పిఎస్ సుందర్ రాజ్ దొర..పి ఎస్ ఆర్ యూత్ జట్టు,ధర్మ జట్టు, జై భీమ్ జట్టు, చాణగొండ్ల కేశవ జట్టు,డేంజర్. జట్లకు క్రీడా దుస్తులను ఆయన సొంత ఖర్చులతో కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎస్ సుందర్ రాజ్ దొర మాట్లాడుతూ అన్ని జట్ల క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా చూడాలన్నారు.గ్రామీణ క్రీడలు కేవలం శారీరక వ్యాయామానికి మాత్రమే కాదు, మానసిక ఉల్లాసానికి మరియు ప్రశాంతతకు చిరునామాలన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఈ కబ్బడి ఆట అద్భుతమైన సాధనం అన్నారు.కబడ్డీ వల్ల కలిగే మానసిక ప్రయోజనాలు మనసు పూర్తిగా ఆటపైనే లగ్నమవుతుంది. దీనివల్ల రోజువారీ పనులు, చదువు లేదా ఉద్యోగ సంబంధిత ఒత్తిడి మాయమవుతుందన్నారు. మట్టితో మనకు ఉండే అనుబంధం సహజంగానే మనసును ప్రశాంతంగా ఉంచుతుందన్నారు.అనంతరం ఐదు కబడ్డీ జట్ల క్రీడాకారులు పిఎస్ సుందర్ రాజ్ దొరకు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ధర్మరాజు,బాపురం ఆంజనేయులు,వేమారెడ్డి, బొంబాయి బాబు, వార్డ్ మెంబర్ ఈరన్న, దుర్గప్ప, నరసింహులు, యువ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వచ్చే భక్తులు విలువైన ఆభరణాలు ధరించవద్దు

*సిఐ మంజునాథ్..*

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
కోసిగి ఎల్లమ్మ జాతర కు వచ్చే భక్తులు విలువైన ఆభరణాలు ధరించి రావద్దని, కోసిగి సిఐ మంజునాథ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం రోడ్, ఆదోని రోడ్డు మరియు హాల్వి రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆ రూట్ల లోనే పార్కింగ్ ప్లేసెస్ ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. కావున జాతర సందర్భంగా వచ్చే భక్తులు అందరూ కూడా పోలీసులకు సహకరించి నిర్దేశించిన పార్కింగ్ ప్లేస్ లో మీ యొక్క వాహనాలను జాగ్రత్తగా పార్కింగ్ చేసుకోవలెనని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు విలువైన బంగారు, వెండి నగలను ఎక్కువగా ధరించి రాకూడదని, అలాగే ఎక్కువ మొత్తంలో డబ్బును తీసుకురాకూడదని కోరడమైనదని తెలిపారు. ఎందుకనగా జాతరలో కొంతమంది వ్యక్తులు భక్తుల యొక్క రద్దీ ఆసరాగా చేసుకుని మీ యొక్క విలువైన ఆభరణాలను, డబ్బును, సెల్ఫోన్లను దొంగలించే అవకాశం వుందని తెలియజేస్తున్నాముఅన్నారు.



జాతరకు వచ్చే వ్యక్తులు భక్తులకు, రథోత్సవానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ఇతరులను రెచ్చగొట్టే విధంగా సైగలు గాని, వ్యాఖ్యలు గాని చేయకూడదని కోరుతున్నాముఅని అన్నారు. పోలీసుల యొక్క హెచ్చరికలను కాదని ఏదైనా అలజడి సృష్టించాలని ప్రయత్నించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి తెలియజేస్తున్నాం.అన్నారు. ఎల్లమ్మ జాతరకు కోసిగికి వచ్చే భక్తులందరూ కూడా భక్తి భావంతో, ఉత్సాహంగా ఈ యొక్క జాతరలో మరియు రథోత్సవంలో పాల్గొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ కూడా సహకరించాలని కోరుతున్నామని అన్నారు.



పోస్టు కార్డు ఉద్యమం కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోస్ట్‌కార్డు ఉద్యమం

*12వ పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలి*

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి కౌలన్న స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దకడబూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌలన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. చైర్మన్ నియామకం వరకు ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనంగా 29 శాతం ఇంటీరిమ్ రిలీఫ్ (ఐఆర్) ను తక్షణమే ప్రకటించాలని కోరారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలు, కుటుంబ వ్యయాల నేపథ్యంలో ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శివకుమార్, ప్రశాంత్ భూపాల్, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కలుగట్ల గ్రామంలో మీ భూమి- మీ హక్కు

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
ఎమ్మిగనూరు నియోజకవర్గం కలుగట్ల గ్రామంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. సభలో సీఎం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి , మంత్రులు అనగాని సత్యప్రసాద్ నిమ్మల రామానాయుడు టీజీ భరత్ ఎంపీ నాగరాజు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్న సీఎం చంద్రబాబు

# మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధికి హామీ

### పులికనుమ ప్రాజెక్టు ఎత్తు పెంపు .. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.44 కోట్లు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపాదన, పట్టుదల, ఫలితాన్ని ఒకే దారిలో నడిపించిన నాయకుడిగా టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి మరోసారి తన రాజకీయ చాతుర్యాన్ని నిరూపించారు. ఆయన సమర్పించిన కీలక అభివృద్ధి ప్రతిపాదనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆమోద ముద్ర వేశారు. రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలగొట్ల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో, మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించిన జలవనరులు, సాగునీటి సమస్యలపై ఎన్. రాఘవేంద్ర రెడ్డి విపులంగా వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు శ్రీ రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

సానుకూలంగా స్పందించి కీలక హామీలు ప్రకటించారు. ఎన్. రాఘవేంద్ర రెడ్డి సూచనల మేరకు పులికనుమ ప్రాజెక్టు ఎత్తును పెంచి అదనంగా 2 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో మంత్రాలయం, ఎమ్మిగనూరు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడనుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గురురాఘవేంద్ర ప్రాజెక్టు అభివృద్ధికి రూ.44 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం మరో కీలక పరిణామంగా నిలిచింది. ఈ నిధులతో ప్రాజెక్టు సామర్థ్యం పెరగడంతోపాటు, నియోజకవర్గంలో భూగర్భ జలాలు పునరుత్పత్తి అయ్యే అవకాశం ఉందని నీటిపారుదల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ రెండు కీలక అభివృద్ధి నిర్ణయాలు మంత్రాలయం నియోజకవర్గానికి వరంలా మారనున్నాయని టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి. నిధుల మంజూరు, నీటి నిల్వ సామర్థ్య పెంపుపై స్పష్టమైన హామీలు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలతో టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరితో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

# శ్రీ మంజునాథ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలు

### గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు... ఘనంగా స్వామి వారి గ్రామోత్సవం... భక్తిశ్రద్ధలతో శివ స్వాముల అగ్నిగుండ ప్రవేశం..

**బెళుగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
బెళుగుప్పలో కొలువైన శ్రీ ధర్మస్థల మంజునాథ స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. అర్చకులు చిరంజీవి స్వామి, శివ దీక్ష వ్యవస్థాపకులు అనంతలు స్వామి, శివలింగప్ప స్వామి, శివ స్వాముల ఆధ్వర్యంలో ఆలయంలో శుక్రవారం ఉదయం గణపతి పూజ పుణ్యాహవాచనం, స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, కలశ స్థాపన,ఋత్విక్ గర్వణం, గణపతి హోమం,నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట వార్షిక ప్రత్యేక పూజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పువ్వులు, విద్యుత్ దీపాలంకరణతో అందంగా



ప్రత్యేక అలంకరణలో శ్రీ మంజునాథ స్వామి.



హోమాలు నిర్వహిస్తున్న స్వాములు

అలంకరించారు.

**ఘనంగా స్వామివారి గ్రామోత్సవం..**
శ్రీ మంజునాథ స్వామి ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ట వార్షికోత్సవ పూజల్లో భాగంగా సాయంత్రం స్వామివారి ఉత్సవ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ లో ఉంచి, శివ స్వాముల ఆధ్వర్యంలో నంది కోలు ఆడుతూ, శివుని పాటలకు నృత్యాలు చేస్తూ గ్రామంలో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు...

**భక్తిశ్రద్ధలతో శివ స్వాముల అగ్నిగుండ ప్రవేశం..**
శ్రీ మంజునాథ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట వార్షికోత్సవ పూజల్లో భాగంగా శివమాల ధరించిన శివస్వాములు భక్తిశ్రద్ధలతో శుక్రవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ప్రవేశ ద్వారం ముందు ప్రత్యేకంగా అగ్ని గుండాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారి గ్రామోత్సవం అనంతరం శివమాల ధరించిన స్వాములు "ఓం నమశ్శివాయ, ఓం నమశివాయ " అంటూ శివనామస్మరణంతో భక్తితో అగ్నిగుండ ప్రవేశం చేశారు. చాలా ఏళ్లు తర్వాత గ్రామంలో శివమాల ధరించిన స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేయడంతో కార్యక్రమాన్ని తిలకించడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాత్రికి భజన కార్యక్రమాలు నిర్వహించారు..



గ్రామంలో శివ స్వాములు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.
భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న శివమాల ధరించిన శివ స్వాములు.

# బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాం

### డీసీపీవో గీతావాణి ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామని డీసీపీవో గీతావాణి, ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి దేవి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహ రహిత గ్రామంగా హనుమాపురం గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బాల్య వివాహాల కారణంగా చిన్నారుల, ముఖ్యంగా బాలికల జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఆరోగ్యం, భవిష్యత్ అవకాశాలు దెబ్బతింటాయని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, యువత సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టవిరుద్ధమని, 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం జరిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనుమానాస్పద ఘటనలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ హనుమాపురాన్ని ఆదర్శ బాల్య వివాహ రహిత గ్రామంగా నిలబెట్టేందుకు అందరూ సహకరించాలని



బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతిన చేస్తున్న దృశ్యం

వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



బేగారి మూకప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

## బేగారి మూకప్ప మృతికి వైసీపీ నేతల నివాళి

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన బేగారి మూకప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, వైసీపీ నాయకులు బ్రహ్మయ్య ఆచారి, బోయ కదుబూరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరపున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. బేగారి మూకప్ప ఆత్మకు శాంతి చేకూరాలని నేతలు ప్రార్థించారు.



మోటర్ కేబుల్ చోరీలపై తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్న సిఐ శ్రీనివాసులు.

## మోటర్ కేబుల్ చోరీలపై రైతులకు అవగాహన

*సీఐ. శ్రీనివాసులు.*

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
యాడికి మండల పరిధిలోని కోన ఉప్పలపాడు గ్రామంలో మోటర్ కేబుల్ వైర్ చోరీలపై రైతులకు ప్రజలకు యాడికి అవగాహన కల్పించారు. శుక్రవారం కోన ఉప్పలపాడు గ్రామంలో సందర్శించి ప్రస్తుతం జరుగుతున్న మోటార్ వైర్ దొంగతనాలపై అవగాహన కల్పిస్తూ జరగకుండా ఉండుటకు గాను కావలసిన మెలకువలు తెలుపుతూ, మోటార్ వైరును కేసింగ్ పైపు నుండి మూడు అడుగుల లోతున ఆయా గ్రామ ప్రజలు పోలీసులతో సహకరించి యూత్ స్పెషల్ టీమ్స్ గా రాత్రి సమయంలో పోలీసులతో పాటుగా గస్తీ తిరగవలసినదిగా కోరడమైనది. రాత్రి సమయంలో ఎవరి పైన అనుమానం ఉన్న వారిపై వెంటనే పోలీసులకు సమాచారం తెలిపాలని సిఐ శ్రీనివాసులు ప్రజలకు రైతులకు వివరించారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో శుక్రవారం చాకలి లక్ష్మయ్య (51) గుండెపోటుతో మృతి చెందాడు.. లక్ష్మయ్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు..రోజువారి లాగే కూలి పనుల నిమిత్తం చెరకులు కోయడానికి వెళ్లి గుండెలో నొప్పి రావడంతో గమనించిన స్థానికులు యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. మెరుగైన వైద్యం కొరకు తాడిపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.. మృతుడు లక్ష్మయ్యకు ముగ్గురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు...



మృతి చెందిన చాకలి లక్ష్మయ్య

## ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించేందుకే జగన్ యాత్రలు

**విజయవాడ, ఫిబ్రవరి 6 :**
వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రజల్లో భయభ్రాంతులు కలిగించేందుకే యాత్రల పేరుతో డ్రామాలు చేస్తున్నాడని, ఇది పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమేనని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. జోగిరమేష్ ఇంటి వద్ద జగన్ సీఎంచంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, టిడిపి సీనియర్ నాయకులు కోగంటి రామారావు తో పాటు టిడిపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడూ శాంతియుత రాజకీయాలు కోరుకుంటారని, వై.ఎస్. జగన్ మాత్రం హింసాత్మక రాజకీయాలకు ప్రతీకగా మారారన్నారు.



ఏనుగు దాడితో మృతి చెందిన పాడి ఆవు

## ఏనుగు దాడిలో ఆవు మృతి

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలోని పిఎంకె తాండ గ్రామ శివార్లలో ఒంటరి ఏనుగు ఆవుపై దాడితో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు గురువారం రాత్రి ఒంటరి ఏనుగు అటవీ ప్రాంతం నుంచి పిఎంకె తాండ పంట పొలాలపై దాడులు చేస్తూ గ్రామ సమీపంలో షెడ్డు వద్ద దేవేంద్ర నాయక్ కు చెందిన 70 వేలు విలువచేసే పాడి ఆవు ఒంటరి ఏనుగు బలికొంది. అటవీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆవు మృతి చెందిన పరిసరాలను పరిశీలించి బాధితులని ఆదుకోవాలని తెలిపారు. ఏనుగులు గ్రామాల వైపు చొరబడకుండా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

## ఘనంగా పశువుల పరుగు పందాలు

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండలంలోని మణీంద్రం గ్రామంలో పశువుల పరుగు పందాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మహిళలు గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్ళు పెట్టి విశేష పూజలు చేసి జంతు బలిదానం చేశారు. అనంతరం రైతులు తమ పశువులను శుభ్రం చేసి రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించి గ్రామ దేవత ఆలయం వద్ద విశేష పూజలు చేసి ప్రధాన వీధిలో పరుగు పందాలను నిర్వహించారు. గెలుపొందిన పశువులకు బహుమతులు అందజేశారు.



పరుగులు తీస్తున్న పశువును సతిలకిస్తున్న యువకులు

# పెద్ద గురువులకు విద్యాంజలి యాప్‌పై అవగాహన సదస్సు

### మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్ ..

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలోని అన్ని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల పెద్ద గురువులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యాంజలి యాప్‌పై ఎంఈఓ నాగేశ్వర్ నాయక్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ విద్యాంజలి కార్యక్రమం అనేది స్వచ్ఛంద సేవ మాత్రమేనని, పాఠశాలల పూర్వ విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు,తదితరుల సహాయంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల ను విద్యాంజలి పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొని మీ పాఠశాలకు కావలసిన మౌలిక వసుతులను గుర్తించి విద్యాంజలి పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. అలా చేసినట్లయితే విద్యాంజలి పోర్టల్‌తో అనుసంధానం ఉన్న పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యావేత్తలు, పాఠశాలల పూర్వ విద్యార్థులు సమాజ సేవకులు, గ్రామ ప్రజలు సహకరించి పాఠశాలల అభివృద్ధికి తొడ్పాటు అందిస్తారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -1అన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబులేసు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్ రామాకేశవ, సి ఆర్ పి లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పెద్ద గురువులు



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్



విద్యార్థులతో వైద్యాధికారులు, ఉపాధ్యాయులు

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

### ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్. .

**దువ్వూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మంది విద్యార్తులకు కంటి అద్దాలు ఉచితముగా ఇచ్చినట్లు ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్ తెలిపారు, ఈ సందర్భంగా ఆఫ్తాలామిక్ ఆఫీసర్ జి. చంద్రమౌళి మాట్లాడుతూ జాతీయ అందత్వ నివారణ లో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికీ కంటి అద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు కంటి ఆరోగ్యశీ పట్ల విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ భాస్కర్, జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాసులు మరియు ఇతర ఉపాధ్యాయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హారతి, ఏ ఎన్ ఎం వనజ, సుజిలలిత, ఆశాకార్య కర్త సుజాత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ రికార్డుల డిజిటలైజేషన్‌తో రైతులకు మేలు

### తహసిల్దార్ సంజీవరెడ్డి..

**దువ్వూరు (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో లాభదాయకమని, దీనివల్ల భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని తహసిల్దార్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో నిర్వహిస్తున్న నాలుగో విడత రీ సర్వే పనులను ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ.. రీ సర్వే ద్వారా భూ రికార్డులన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయబడుతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులు లభిస్తాయన్నారు. శాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న ఈ సర్వే ద్వారా హద్దుల తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందిఆన్‌లైన్ డిజిటలైజేషన్ వల్ల రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా, మండల సర్వేర్ మదన్ మోహన్ రెడ్డి, వీఆర్వో, వీఆర్ఏ రైతులు పాల్గొన్నారు.



భూ సర్వేను పరిశీలిస్తున్న తహసిల్దార్ సంజీవరెడ్డి



రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నేతలు

## శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలోని కెంచన బల్ల పంచాయతీలోని పచ్చారు మాకులపల్లి నుంచి రెడ్డివారి పోడు గ్రామం వరకు రాష్ట్ర నేత నారాయణ చారి కృషితో శ్రమదానంతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్యతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు దీంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్ సిసి రోడ్డు, బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజు నాయక్, పంచాయతీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, గుణశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

# బీసీ సింహ గర్జనను విజయవంతం చేద్దాం

### మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో పోస్టరు ఆవిష్కరణ
### బీసీవై రాష్ట్ర సభ్యులు రమేష్ యాదవ్,,

**మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని అమరావతి కేంద్రంగా నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా బిసి సంహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు పాల రమేష్ యాదవ్, రాష్ట్ర కమిటి సభ్యులు సాంబమూర్తి, జిల్లా కన్వీనర్ హరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశాంలో ముందుగా బీసీ సంహగర్జన పోస్టరును ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీవై పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గిరిబాబు, కో-కన్వీనర్ భరత్, బీసీ నవ చైతన్య వేధిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి నరావుల మణిశంకర్, మల్లెపల్లి సుబ్రమణ్యం, బీసీవై పార్టీ నాయకులు శంకర్, వెంకటేష్, రెడ్డెప్ప, నారాయణలతో మాట్లాడారు. ఈ నెల 22న బీసీవై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "బీసీ సింహ గర్జన" మహాసభకు రాష్ట్రంలోని 28 జిల్లాలు, 175నియోజకవర్గాల నుంచీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు అత్యధిక సంఖ్యలో కులమత, ప్రాంత భేదాలు లేకుండా భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. బీసీలకు రకక్షణ చట్టం, అమరావతి రాజధానిలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలని, బీసీ కులాల కార్పోరేషన్ నిధులు ప్రతిఏటా విడుదల చేసి, వడ్డీలేని రుణాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టనున్న సమగ్ర కులగణన నిష్పక్షపాతంగా నిర్వహించాలని, విద్య ఉద్యోగం స్థానిక సంస్థలు, చట్టసభలలో బీసీలకు 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేపట్టబోవు సింహగర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ ఎద్దుల హరిబాబు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు చనకంటి సాంబమూర్తి ఆంధ్ర రాష్ట్ర సోషల్ మీడియా కో-కోఆర్డినేటర్ గిరిబాబు కుమ్మర, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో బీసీ సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరణ చేస్తున్న బీసీవై నాయకులు



చిల్లర దుకాణాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

## పి -4 ఆర్థిక సాయంతో చిల్లర దుకాణం ఏర్పాటు

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలోని పీఎంకే తండాలో పి -4 ద్వారా ఆర్థిక సాయంతో మురళి, గీత చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. 75 వేల రూపాయలు ఆర్థిక సాయంతో ప్రజాప్రతితులు చిల్లర దుకాణాన్ని శుక్రవారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవారిని గుర్తించి ఆర్థిక సహాయం అందించి వారికి భరోసా కల్పిస్తుంది అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ నాయక్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, నేతలు ముని రెడ్డి, చంద్రబాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అక్కదేవతలు చతుర్ధ వార్షికోత్సవ గ్రామోత్సవం

**యాడికి(తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో వెలసిన శ్రీ అక్కదేవతల దేవస్థానం నందు శ్రీస్వస్తి శ్రీవిశ్వావసు నామ సం॥ర మాఘ మాసం శు॥చవితిశ్రీ అక్కదేవతలు చతుర్ధ వార్షికోత్సవ గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 5 వ తేది గురువారం ఉదయం 8 గంటలకు అక్కమహాదేవి స్వరూపములు పంచామృత అభిషేకములు మహామంగళ హారతి తదుపరి శ్రీ మహాగణపతి, నవగ్రహ, దుర్గ సర్వప్రాయ చితార్థశాంతి హోమములు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గం లకు నుండి 25 కలశాలు తో మహిళలు తలపై పెట్టుకొని కమలపాడు రోడ్డులో ఉన్న అక్కదేవతల ఆలయం వద్ద నుండి పాత పోలీస్ స్టేషన్.వేములపాడు రోడ్డు. లాలాల వీధి వైశ్య వీధి. మైండ్ రోడ్డు మీదుగా తిరిగి అమ్మవారి ఆలయ వరకు అమ్మవారి గ్రామోత్సవము నిర్వహించారు. యాడికిగ్రామ పురోహితులు శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం అర్చకులు ఆలూరు హరిక్రిష్ణశర్మ గారిచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తాదులు అమ్మవారి మహోత్సవం విజయవంతం చేసి అమ్మవారి కృపకు ప్రాతులు అయ్యారు. శుక్రవారం అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. శ్రీ అక్కదేవతల దేవస్థానం అక్కదేవత ఆర్సన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అక్కదేవతల నాల్గవ వార్షికోత్సవం కలశంలతో అక్కదేవతల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.



అక్కదేవతల నాల్గవ వార్షికోత్సవం కలశంలతో అక్కదేవతల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.

# నేడు శ్రీ బూదిగుమ్మ సంజీవరాయ స్వామి రథోత్సవం

### కన్నుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం..

**బెళుగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామ సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలసిన బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి ( శ్రీ ఆంజనేయ స్వామి ) ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు జ్ఞానేశ్వర స్వామి, వాసు స్వామి, ఈవో బాబు, ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రిస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివ శంకరప్ప, ఆలయ సలహాదారులు మురళీకృష్ణ, భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం మాఘ బహుళ షష్టి ఉదయం శ్రీవారికి శుద్ధోదక స్నానం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు అక్షింతలు వేసి ప్రార్థించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు...

**నేడు బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి రథోత్సవం..**

బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి ఉత్సవాలలో భాగంగా నేడు శనివారం సాయంత్రం 4 గంటలకు శ్రీ సంజీవరాయ స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం గంగపూజ, గోపూజ, స్వామివారికి శుద్ధోదక, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, శ్రీవారి దర్శనం, సాయంత్రం ప్రదోష కాల పూజ, శ్రీవారి పల్లకి సేవ, గరుడ స్తంభ దీపారాధన అనంతరం శ్రీ సంజీవరాయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాబు, అర్చకులు జ్ఞానేశ్వర స్వామి, వాసు స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రిస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివ శంకరప్ప, సలహాదారుడు మురళీకృష్ణ, తదితరులు పేర్కొన్నారు. కావున భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎస్ఐ శివ తన సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.





ప్రత్యేక అలంకరణలో బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి



శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న శ్రీసత్యసాయి కార్మికులు

## శ్రీసత్యసాయి నీటి పథకాన్ని జిల్లా పరిషత్‌లో విలీనం చేయవద్దు

**మంత్రి సత్యకుమార్‌కు శ్రీసత్యసాయి కార్మికుల వినతి**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
ఉమ్మడి అనంతపురం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న శ్రీసత్యసాయి నీటి సరఫరా పథకాన్ని జిల్లా పరిషత్ పరిధిలోకి విలీనం చేయవద్దని, అలా చేస్తే పథకం మూతపడే ప్రమాదం ఉందని శ్రీసత్యసాయి నీటి పథకం కార్మికులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. శుక్రవారం బత్తలపల్లిలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి కార్మికులు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సుమారు 25 సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తూ అనేక నీటి పథకాలకు ఆదర్శంగా నిలిచిన ఈ పథకం ప్రస్తుతం బోర్డు ఆధ్వర్యంలో సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. ఇలాంటి పథకాన్ని జిల్లా పరిషత్తులో విలీనం చేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని వారు స్పష్టం చేశారు.
గ్రామీణ నీటి సరఫరా శాఖ రాష్ట్రస్థాయి అధికారులు బోర్డుతో సంప్రదింపులు లేకుండా తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నం జరిగి ప్రజాప్రతినిధుల జోక్యంతో విరమించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో పథకానికి రూ.31 కోట్ల బడ్జెట్ కేటాయించడమే ప్రభుత్వం ఈ పథకానికి ఇచ్చిన గుర్తింపని పేర్కొన్నారు. 2021లో ఎల్ ఉ టి సంస్థ నిర్వహణ నుంచి తప్పుకున్నప్పటికీ పథకం ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని, బాబా వందవ జన్మదినోత్సవం సందర్భంగా పుట్టపర్తికి రోజుకు 8 మిలియన్ లీటర్ల స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయగలిగిన ఘనత ఈ పథకానిదేనని తెలిపారు. పథకం జిల్లా పరిషత్తులో విలీనం అయితే కార్మిక చట్టాల రక్షణ కోల్పోయి నిర్వహణ దెబ్బతింటుందని, దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడుతుందని కార్మికులు హెచ్చరించారు. స్పందించిన మంత్రి సత్యకుమార్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి హుండీ లెక్కింపు

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలోని హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయములో శుక్రవారం భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ,2 లక్షల 46 వేలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహారాజు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కరే గౌడ ,దేవాదాయ శాఖ అధికారి రమేష్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు, సర్పంచ్ తిప్పేస్వామి, అమరాపురం ఎస్సై వలి బాష, ఏ ఎస్.ఐ. రామాంజనేయులు పాల్గొన్నారు.



శ్రీ సిద్దేశ్వర స్వామి హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం



శ్రీ సిద్దేశ్వర స్వామి హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం



శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై వలీబాష, ఏ.ఎస్.ఐ. రామాంజనేయులు

## సిద్దేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**ఎస్సై వలీబాష..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండల పరిధిలో హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా అమరాపురం ఎస్.ఐ. వలీబాష, ఏ.ఎస్.ఐ. రామాంజనేయులు ఏర్పాట్లను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై ఆలయ ఈ.వో. నరసింహారాజు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని అందుకు తగ్గట్టుగా భారీ ఏర్పాటు చేయాలని సూచించారు.



శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఈవో నరసింహారాజు , ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రే గౌడ్‌తో చర్చిస్తున్న ఎస్ఐ వలీబాష

# మహిళా భద్రతకు సమాజమే కవచంలా నిలవాలి

**మీ భద్రత మా బాధ్యత సదస్సు..**
**జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్..**
**వ్యక్తిగత జాగ్రత్తలు అవసరమే..**
**ఎమ్మెల్యే కందికుంట..**



మహిళను సత్కరించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఎమ్మెల్యే వెంకటప్రసాద్

**కదిరి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టాలంటే చట్టాలు, పోలీసు చర్యలతో పాటు ప్రతి పౌరుడి బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. మహిళా భద్రతకు సమాజమే ప్రధాన కవచమని పేర్కొంటూ, ప్రజల భాగస్వామ్యం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదన్నారు. శుక్రవారం కదిరి పట్టణంలో 'మీ భద్రత - మా బాధ్యత' పేరిట నిర్వహించిన మహిళా చైతన్య సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కదిరి పట్టణంలోని దత్త ఫంక్షన్ హాలులో కదిరి పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీతో పాటు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి హాజరయ్యారు. మహిళా భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలికలు, మహిళలు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అపరిచితుల మాటలు నమ్మి వారితో కలిసి వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. చిన్నారులను చాక్లెట్లతో మభ్యపెట్టి లైంగిక దాడులకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు చిన్న వయసు బాలికలను ఒంటరిగా వదిలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలి పనులకు వెళ్లే సమయంలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో వదిలి వెళ్లాలని సూచించారు.
బాల్యవివాహాలు నేరమని, అలాంటి కేసుల్లో కఠిన శిక్షలు తప్పవని తెలిపారు. బాలికలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో లేదా చీకటి వేళల్లో వెళ్తున్నప్పుడు ఎవరైనా అనుమానాస్పదంగా అనుసరిస్తే వెంటనే విజిల్ వేయాలని, ప్రజల దృష్టిని ఆకర్షించి రక్షణ పొందవచ్చని వివరించారు. ఎలాంటి ప్రమాదం ఎదురైన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.




మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ మహిళా భద్రతపై రాజీపడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. బాలబాలికలు వ్యక్తిగత క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా యువకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, మహిళలు, బాలికలను ఏ విధంగా వేధించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కటకటాల పాలవడం ఖాయమని స్పష్టంగా చెప్పారు. సమాజంలో పరస్పర గౌరవంతో మెలగడం ద్వారా మాత్రమే మహిళలకు నిజమైన భద్రత కల్పించవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్డీఓ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి మహిళా భద్రతకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులతో ప్లకార్డులు, బ్యానర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళల రక్షణపై నినాదాలు చేస్తూ పట్టణ వీధుల్లో సందేశాన్ని చాటి చెప్పారు.
విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే ప్రశంస పత్రాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఇందిర, పట్టణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్మిత, సీడీపీవో రాధికా, పట్టణ సీఐ శ్రీనారాయణరెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్ రెడ్డి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్సైలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

**110 మందికి కంటి పరీక్షలు ..**
**శస్త్ర చికిత్సకు 65 మంది ఎంపిక..**
**జడ్పీటీసీ ఉమేష్..**

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆర్డిటి ఆడిటోరియంలో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 110 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని అందులో 65 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరం పేదలకు వరం లాంటిదని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా దాదాపు 500 మందికి పైగా కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరమున్న 65 మంది రోగులకు బెంగుళూరు శంకర్ కంటి ఆసుపత్రి కి శస్త్ర చికిత్స లకు ప్రత్యేక బస్ లో తీసుకెళ్ళారని అన్నారు.
మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి వైద్యపరీక్షలు నిర్వహించడం మండల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని మండల ప్రజలు జెడ్పిటిసి ఉమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కంటి పరీక్షలకు వచ్చిన వారందరికీ జడ్పీటీసీ ఉమేష్ మధ్యాహ్నం భోజనాలు పెట్టించారు. తరువాత వాళ్లందరిని బెంగుళూరు శంకర్ కంటి హాస్పిటల్‌కు పంపించారు. మాజీ సర్పంచ్ రవి కుమార్, శామ్ సుందర్ శిబిరాన్ని పర్యవేక్షించారు.



కంటి పరీక్షలకు వచ్చిన మండల ప్రజలు



ప్రత్యేక బస్సులో కంటి శస్త్ర చికిత్సలకు తీసుకెళ్తున్న శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు

# వైయస్సార్ సి.పి బలోపేతానికి కృషి

**హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
గ్రామస్థాయిలో వైయస్సార్ సి.పి. బలోపేతానికి కృషి చేయాలని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హేమావతిలో గ్రామస్థాయి కమి టీగా ఎంపికపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గం సమన్వయకర్త ఈర లక్కప్ప,తో కలిసి ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోసం ,పార్టీ ప్రతిష్ట కోసం, పనిచేసే వ్యక్తులకు, కార్యకర్తలకు పదవులను ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియపరచాలని ఆయన సూచించారు. శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం సందర్శించి ప్రత్యేకంగా పూజలు చేయించి ఆలయ చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సి.పి. మండల్ కన్వీనర్ త్రిలోక్నాథ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్కూర్ కాంతరాజు, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శివకుమార్ మండల పరిశీలకులు కామరాజు, శ్రీరాములు, ఎంపీపీ ఈరన్న, మడకశిర ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నారాయణప్ప తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి



హాజరైన వైయస్సార్ సి.పి. నాయకులు కార్యకర్తలు.



విద్యార్థులకు వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎం ఇ ఓ శ్రీధర్

## విద్యార్థులకు పరీక్ష పే చర్చా ప్రధానమంత్రి వీడియో

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రొళ్ళలో విద్యార్థులకు పరీక్ష పే చర్చా ప్రధానమంత్రి వీడియో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురించి పలు సూచనలు ఇచ్చారు. పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపేందుకు పరీక్ష పే చర్చ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి ఏడాది మాదిరి ఈ ఏడాది కూడా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోది పరీక్ష పే చర్చా కార్యక్రమం ఉద్దేశించి విద్యార్థులకు పలు సూచనలు అందించే వీడియోను విద్యార్థులు ఉపాధ్యాయులు వీక్షించడం జరిగింది. చివరిగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పరీక్షలు అంటే భయపడకుండా ఆత్మవిశ్వాసంతో సానుకూలంగా ఎదుర్కొనాలి. ఒత్తిడికి గురికాకుండా అధిగమిస్తేనే సత్ఫలితాలు వస్తాయి. ఏకాగ్రతతో చదివితే ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. రాబోయే పరీక్ష కాలంలో అనారోగ్యాలు రాకుండా ఉండాలంటే మంచి పౌష్టికాహారాన్ని తినాలని సూచించారు. ఇప్పటినుంచి అయినా ప్రణాళిక బద్ధంగా చదివితే సత్ఫలితాలు వస్తాయని తెలియజేసారు.

## ప్రధానోపాధ్యాయుల సమావేశం నేడు

**ఎం ఇ ఓ శ్రీధర్**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు విద్యాంజలి-2.0 అవేర్నెస్ ట్రైనింగ్ ఏర్పాటు చేసినట్లు ఎంఇఓ శ్రీధర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాత్రమే హాజరు కావాలని ఒక పాఠశాల నుండి ఒకరు మాత్రమే హాజరు కావాలని తెలిపారు. సింగల్ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల వారు మధ్యాహ్న భోజనం తర్వాత హాజరు కావాలన్నారు.





లెప్రసీ ఎంసి ఆర్ చెప్పులు అందిస్తున్న డాక్టర్ కీర్తన, డిపిఎమ్ఓ రామచంద్ర

## కుష్టువ్యాధి నిర్మూలన స్పర్శ అవేర్నెస్ అవగాహన సదస్సు

**డీపీఎంఓ రామచంద్ర..**

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 6 :**
పుట్లూరు మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో జనవరి 30 నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలనపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుష్టు వ్యాధి నిర్మూలన స్పర్శ అవేర్నెస్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమమును తిమ్మంపల్లి వైద్య అధికారి. కీర్తన . డిపిఎమ్ఓ రామచంద్ర కుష్టు వ్యాధి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు వివరిస్తూ స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు రాలిపోవటం, కాళ్ళకు చెప్పులు జారిపోవటం, చేతులతో వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవటం కుష్టు వ్యాధి లక్షణాలు అన్నారు. కుష్టు వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వైద్యసేవలపై ప్రజలకు వివరిస్తూ పరీక్షించారు. అనంతరం గ్రామంలో అనుమానం ఉన్న వృత్తులకు పరీక్షించి 8 మందికి లెప్రెసి ఎం సి ఆర్ చెప్పులు అందించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్. కీర్తన. డిపిఎమ్ఓ రామచంద్ర. ఎం పి హెచ్ ఎస్ . సిహెచ్ఓ. ఆశ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి అనుమానితులను పరీక్షిస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర

## కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

# రాష్ట్రంలో సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం

**అమరావతి, ఫిబ్రవరి 6 :**
భారతదేశ భవిష్యత్ సాంకేతిక రంగాన్ని మలుపుతిప్పే చారిత్రక ఘట్టానికి అమరావతి శనివారం వేదికగా నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి రేపు పునాదిరాయి పడుతోంది. దీని ద్వారా భారతదేశం క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి రానుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. మధ్యాహ్నం 2.45 గంటలకు క్యాంప్ ఆఫీస్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి 3.00 గంటలకు ఉద్దండరాయునిపాలెం చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే క్వాంటమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు.
అమరావతిలో రూపుదిద్దుకుంటున్న క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, ఉత్పత్తి, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెట్టారు.




# అర్జున్ కూతురు హీరోయిన్‌గా సీతాపయనం

యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేనే ÷ట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళు _న్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

# సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రాకాస



టాలీవుడ్ యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాకాస' ఇప్పుడు సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'మ్యాడ్' సినిమాతో యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించిన సంగీత్ శోభన్ ఈసారి ఫాంటసీ,హారర్ జానర్‌లో కొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రంలో 'ఆయ్' మూవీ ఫేమ్ నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా, దర్శకురాలు మానస శర్మ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, ఆమె నిర్మాణంలో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. యువతరానికి దగ్గరగా ఉండే కథలు, కొత్త కాన్సెప్ట్‌కి ప్రాధాన్యం ఇస్తూ నిహారిక నిర్మాణంలో వస్తున్న ప్రతి చిత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల విడుదలైన 'రాకాస' టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫాంటసీ ఎలిమెంట్స్, హారర్ బ్యాక్‌డ్రాప్, కామెడీ టచ్ అన్నీ కలగలిపి వినోదభరితంగా టీజర్ ఉండటంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగింది. సోషల్ మీడియాలో కూడా ఈ టీజర్‌కు మంచి స్పందన లభించింది. అప్పటి నుంచి సినిమా రిలీజ్ ఎప్పుడన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'రాకాస' చిత్రాన్ని 2026 ఏప్రిల్ 3న సమ్మర్ కానుకగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పెషల్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. సమ్మర్ హాలిడే సీజన్‌ను టా÷-గ్గ÷ట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యువతను కూడా ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫాంటసీ, హారర్, హిలేరియస్ కామెడీ అంశాలతో ఫుల్ ఆన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంగీత్ శోభన్ కెరీర్‌లో మరో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. విభిన్న జానర్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందో తెలుసుకోవాలంటే ఏప్రిల్ వరకు వేచి చూడాల్సిందే.

-----------

# 11న ఓటిటిలోకి అనగనగా ఒక రాజు

11న ఓటిటిలోకి అనగనగా ఒక రాజు

ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100? కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.






# మైత్రీమూవీ మేకర్స్‌తో నవీన్ పొలిశెట్టి చిత్రం

'అనగనగా ఒక రాజు' చిత్రంతో మొదటిసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పోలిశెట్టి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విజయంతో నవీన్ పోలిశెట్టి తన కెరీర్‌లో తొలి వంద కోట్ల మైలురాయిని అందుకున్న నటుడిగా నిలిచారు. అయితే ఈ అద్భుతమైన విజయంతో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా తమ తదుపరి ప్రాజెక్ట్‌లో నవీన్ భాగమవుతుండడంతో ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించింది. అయితే మైత్రీ బ్యానర్‌లో రాబోతున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందని ప్రేక్షకులకు ఎదురుచూస్తున్నారు.

# ఓటిటిలోకి అవార్డు ఫిలిమ్ సబర్ బోండా

'సన్‌డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్' (యూఎస్) లో ప్రదర్శితమై, విజేతగా నిలిచిన చిత్రం 'సబర్ బొండా'. ఈ అవార్డు సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చింది. 'నెట్‌ఫ్లిక్స్' ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన తొలి మరాఠీ సినిమా కూడా ఇదే కావడం విశేషం. 'క్యాక్టస్ పియర్స్' టైటిల్‌తో మరాఠీలో రూపొందగా.. సన్‌డ్యాన్స్ చిత్రోత్సవంలో 'సబర్ బొండా' పేరుతో ప్రదర్శించారు. ఈ సినిమాని భూషణ్ మనోజ్, సురాజ్ సుమన్ ప్రధాన పాత్రల్లో రోహన్ పరశురామ్ తెరకెక్కించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు స్వలింగ సంపర్కుల కథగా ఈ సినిమా రూపొందింది. తండ్రీకొడుకుల సెంటిమెంట్‌కూ ఇందులో ప్రాధాన్యం ఉంది. గతేడాది జనవరిలో అవార్డు దక్కించుకున్న ఈ సినిమాని 'గోథెన్‌బర్గ్ ఫిల్మ్ ఫెస్టివల్'లోనూ ప్రదర్శించారు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైంది. టాలీవుడ్ హీరో రానాకు చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ డిస్ట్రిబ్యూట్ చేయడం విశేషం.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.